క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



బూరుగుపూడిలో అయ్యప్పస్వామిని దర్శించుకున్న తోట నరసింహం

కిర్లంపూడి: మండలంలోని బూరుగుపూడిలో శనివారం అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ, పార్టీ నాయకుడు పాఠంశెట్టి కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ పాఠంశెట్టి సత్యవతి, ఆశపు బద్రి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది చిత్రపటం ఆవిష్కరణ



న్యాయవాది వెంకటన్నదొర చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తి కాటం భాను

ప్రత్తిపాడు: స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం సీనియర్ న్యాయవాది స్వర్గీయ వెంకన్నదొర చిత్రపటాన్ని ఆవిష్కరించారు. బార్ అధ్యక్షుడు అనిసింగరాజు కుక్కుటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో న్యాయమూర్తి కాటం భాను ముఖ్య అతిథిగా పాల్గొని న్యాయవాది వెంకన్నదొర చిత్రపటాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కొల్లా వీర్రాజు, చెలంకూరి రామకృష్ణ, పాలాట్ల కాశీప్రసాద్, బార్ ప్రతినిధులు రవణం వీర వెంకట్రావు, బొంగుభూరి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గండేపల్లి: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు గండేపల్లి ఎస్సై శేఖర్ శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని సూరంపాలెం గ్రామానికి చెందిన వన్నెం దుర్గబాబు (43) గత నెల 26వ తేదీ రాత్రి మద్యం తాగి ఇంటి మేడపై నుంచి కింద ప్రహరీపై పడ్డాడు. అతని తల, నడుముకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాకినాడలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. దీనిపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీఈ రాంబాబు సేవలు మరువలేనివి



డీఈ రాంబాబు దంపతులను సత్కరిస్తున్న ఈఓ రామచంద్రమోహన్, సిబ్బంది

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం అభివృద్ధికి డీఈ బీఎస్ రాంబాబు చేసిన సేవలు మరువ లేనివని దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ కొనియాడారు. ఉద్యోగ విరమణ చేసిన డీఈ బీఎస్ రాంబాబును శనివారం సాయంత్రం దేవస్థానం సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈఓ కె.రామచంద్రమోహన్ ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బంది రాంబాబు దంపతులను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. సత్యదేవుని ఫొటో బహూకరించారు. కార్యక్రమంలో దేవస్థానం ఏసీ పి.విశ్వనాథరాజు, ఈఈలు మురళీ, నరసింహరెడ్డి, ఫార్మసీ సూపర్‌వైజర్ వి.మాధవి, పలువురు దేవస్థానం ఉద్యోగులు పాల్గొన్నారు.

గుండె పోటుతో ఉపాధి కూలీ మృతి



జోగారావు మృతదేహం వద్ద కూలీలు

ఏలేశ్వరం: మండలంలోని కొత్త యర్రవరం పరిధిలో శనివారం గుండె పోటుతో ఉపాధి కూలీ మృతి చెందాడు. గ్రామానికి చెందిన తంగేడి జోగారావు (60) ఉపాధి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఉదయం ఉపాధి పనులకు వెళ్లగా అకస్మాత్తుగా కుప్పకూలి మతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఏపీఓ రాజగోపాల్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

జై హనుమాన్



ఏలేశ్వరంలో అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

- ఘనంగా హనుమాన్ జయంతి
- స్వామివారికి ప్రత్యేక పూజలు
- గ్రామాల్లో అన్నసమారాధనలు

ఏలేశ్వరం: రామదూత, పవనపుత్రుడు హనుమంతుని జయంతి వేడుకలు శనివారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో కన్నులపండువగా జరిగాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాలకు పోటెత్తారు. పలు గ్రామాల్లో మధ్యాహ్నం అన్నసమారాధనలు నిర్వహించారు. ఏలేశ్వరం షిర్డీనగర్‌లోని అభయాంజనేయస్వామి వారి విగ్రహానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి తమలపాకుల పూజ, సింధూర పూజ నిర్వహించారు. అనంతరం భజనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్, ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్ కుమార్, అడపా పార్థసారథి, గూడవిల్లి అర్జునరావు, పతివాడ జగదీష్, చందక కిరణ్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక మార్కెట్‌వీధిలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. యర్రవరంలోని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

తుని రూరల్: మండల వ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో హనుమాన్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నిమ్మకాయలు, తమలపాకులు, పూలమాలలతో విశేషంగా అలంకరించారు. డి.పోలవరం, వి.కొత్తూరు, హంసవరం, రాపాక, టి.తిమ్మాపురం, కేఓ.మల్లవరం, రేఖవానిపాలెం, ఎస్.అన్నవరం, ఎన్.సూరవరం, కొత్త సూరవరం, ఎస్.చామవరం, జిల్లేడుపాడు, వల్లూరు, లోవకొత్తూరు, రాజుపేట, తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతిని కన్నులపండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా హనుమాన్ జయంతి

తుని: పట్టణంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రజలు ఆంజనేయస్వామి ఆలయాలకు పోటెత్తారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలు ఆలయాల వద్ద అన్నదానం నిర్వహించారు.

కిర్లంపూడి: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల వద్ద శనివారం ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే తోట నరసింహం కిర్లంపూడిలో వేంచేసిన అభయాంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండలంలో పలు శుభకార్యాలకు హాజరయ్యారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ, పెంటకోట నాగబాబు, వేగి రామకృష్ణ, వైఎస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, అడారి మహేష్, పీలా లోవసుబ్రహ్మణ్యం, అడారి గంగబాబు తదితరులు 0పాల్గొన్నారు.

రౌతులపూడి: హనుమాన్ జయంతి వేడుకలు మండల వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. మండలంలోని శృంగవరం-మెరక చామవరం సమీపంలోని నందనవనంలో అభయాంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం స్వామివారి సన్నిధిలో అన్నసమారాధన నిర్వహించారు. మండలంలోని ఎ.మల్లవరం, బలరామపురం, ములగపూడి, రౌతులపూడి, రాజవరం, గుమ్మరేగుల, తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించారు. బలరామపురం, ములగపూడి గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.



తునిలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



ప్రత్తిపాడు ఆంధ్రా భద్రాద్రిలో హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్న భక్తులు



కిర్లంపూడిలో అభయాంజనేయస్వామిని దర్శించుకున్న తోట నరసింహం

మజ్జిగ పంపిణీ

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లిలో హనుమత్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పల్లపు వీధి రామాలయం వద్ద భక్తులు, బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు.

హనుమాన్ జయంతి వేడుకలు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానం, బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద గల ఆంజనేయస్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్థానిక జాతీయ రహదారిపై నరేంద్రగిరి వద్ద గల ఆంధ్రా భద్రాద్రి క్షేత్రంలో గోదారంగనాథ గోష్టి జరిగింది. హనుమజ్జయంతి సందర్భంగా భక్తులు 108 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు.

ఘనంగా హనుమాన్ జయంతి

గోకవరం: హనుమాన్ జయంతిని మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. గోకవరంలో ప్రధాన రహదారి చెంత వేంచేసిన దాసాంజనేయ స్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు ఆరవిల్లి సీతారామాచార్యులు, వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే గుమ్మళ్లదొడ్డి, తంటికొండ, కొత్తపల్లి, కామరాజుపేట, అచ్యుతాపురం, రంపయర్రంపాలెం తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.



తపోవనం ఆశ్రమంలో స్వామివారి విగ్రహానికి పూజలు చేస్తున పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు



రౌతులపూడిలోని గోడౌన్‌లో ఎరువులు, విత్తనాలను పరిశీలిస్తున్న ఏఓ ఈశ్వరరావు



తుని మండలంలోని ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ అశోక్ కుమార్

తుని రూరల్: విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే డీలర్ల లైసెన్స్‌లు రద్దు చేస్తామని మండల వ్యవసాయాధికారి ఎ.అశోక్ కుమార్ హెచ్చరించారు. మండలంలో తేటగుంట, డి.పోలవరం, కేఓ మల్లవరం, వి.కొత్తూరు, రాపాక, హంసవరం, టి.తిమ్మాపురం తదితర గ్రామాల్లో ఎరువులు, పురుగు మందులు, విత్తన దుకాణాల్లో శనివారం ఆయన తనిఖీలు నిర్వహించారు. విత్తనాలు, ఎరువుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. విత్తనాలను మొలకెత్తించి మొలక శాతాన్ని రికార్డుల్లో నమోదు చేయాలని, పత్తి విత్తనాలు నిర్దేశించిన ధర రూ.863కి విక్రయించాలని దకాణదారులకు సూచించారు. కొనుగోలుదారులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. రైతులు పంట పూర్తయ్యే వరకూ బిల్లులను భద్రపర్చుకోవాలని సూచించారు.

ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు

రౌతులపూడి: మండలంలోని ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే అమ్మాలని మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు ఆదేశించారు. రౌతులపూడిలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఆయా షాపుల్లో రిజిస్టర్లు, బిల్ బుక్‌లను పరిశీలించారు. అమ్మకాలకు నిల్వ చేసిన విత్తనాలను, ఎరువుల గొడౌన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రసీదు పొందాలని సూచించారు.

నేటి నుంచి 30 పోలీస్ యాక్ట్ అమలు

- డీఎస్పీ లతాకుమారి

కిర్లంపూడి: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో శనివారం నుంచి మండలంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటాయని పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి తెలిపారు. శనివారం మండల కేంద్రమైన కిర్లంపూడిలో ఎస్సై షేక్ జబీర్ ఆధ్వర్యంలో జగ్గంపేట సీఐ లక్ష్మణరావుతో కలిసి ప్రధాన రాహదారిపై ర్యాలీ నిర్వహించారు. పోలీస్ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ లతాకుమారి మాట్లాడుతూ కౌంటింగ్ పూర్తయ్యే వరకు మండల పరిధిలో సభలు, ర్యాలీలు, విజయోత్సవాలు, ఊరేగింపులు నిషేధమన్నారు. సోషల్ మీడియాలో అనుచితంగా రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టిన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 3, 4, 5 తేదీల్లో మద్యం దుకాణాలు మూసివేయడంతో పాటు లూజు విక్రయాలుపై కఠిన ఆంక్షలు ఉంటాయన్నారు. ఆయా తేదీల్లో గ్రామాల్లో ఎక్కడైనా లిక్కర్ విక్రయాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. పెట్రోల్ బంకుల్లో లూజు పెట్రోల్, డీజిల్ విక్రయాలు నిషేధమన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇప్పటికే అన్ని గ్రామాల్లో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో పికెట్‌తో పాటు సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. ఎస్సై బలరాం, ఏఎస్సై కుమార్, క్యూఆర్టీ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి



ప్రత్తిపాడులో ఎంపీడీఓ డేవిడ్‌రాజ్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

ప్రత్తిపాడు: మండలంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ కోరారు. ఈ మేరకు చిలుకూరి ఆధ్వర్యంలో బీజేపీ అనుబంధ సంస్థల నాయకులు శనివారం ప్రత్తిపాడు మండల అభివృద్ధి అధికారి ఎస్.డేవిడ్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిలుకూరి రామ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని ప్రధాన జలాశయాలైన సుబ్బారెడ్డి సాగర్, చంద్రబాబు సాగర్ ప్రాజెక్టులు ఆధునీకరణకు నోచుకోకపోవడంతో ఏటా సాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. పంట కాలువల్లో పూడిక తీయించి, ఆయకట్టుకు నీరందేలా చూడాలని కోరారు. గతంలో సాగునీటి చెరువులు, పంట కాలువల మరమ్మతులను విస్మరించడం వల్ల పంట చేతికి అందే సమయంలో మిచాంగ్ తుపాన్ కారణంగా పొలాలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అధికారులు తక్షణమే స్పందించి రైతులు సాగునీటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు శింగిలిదేవి సత్తిరాజు, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి దేవర రామకృష్ణ యాదవ్, బీజేపీ అనుబంధ సంస్థల నాయకులు మదినే సూర్యప్రకాష్, పి. శ్రీనివాస్, కొండి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

గొల్లప్రోలు: కిశోర బాలికలు సమతుల ఆహారాన్ని తీసుకుంటూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వై.కృష్ణవేణి తెలిపారు. మండలంలోని చేబ్రోలులో రుతుస్రావం పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు ఆకుకూరలు, గుడ్లు, పాలు వంటి సమతుల ఆహారాన్ని తీసుకుంటే రుతుక్రమం సక్రమంగా ఉంటుందన్నారు. రక్తహీనత ఉన్నవారికి రుతుక్రమం ఆగుతుందని, దీని నివారణకు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు.

10న దేవస్థానం భూములకు కౌలు వేలం

ప్రత్తిపాడు: మండలంలోని ధర్మవరంలో దేవస్థానం భూములకు ఈ నెల 10న కౌలు వేలం నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి టీవీ సూర్యనారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ధర్మవరంలో రాజగోపాలస్వామి, విశ్వేశ్వరస్వామి వార్ల దేవస్థానం భూములను మూడేళ్ల పాటు సాగు చేసుకోవడానికి టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. ధర్మవరంలో రాజగోపాలస్వామి దేవస్థానానికి చెందిన 48.68 ఎకరాల భూమికి, ధర్మవరం గ్రామ శివారున గల విశ్వేశ్వ స్వామి వారి దేవస్థానానికి చెందిన 21 ఎకరాల భూమికి ఈ నెల 10వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ధర్మవరం రాజగోపాలస్వామి దేవస్థానంలో వేలం నిర్వహిస్తామన్నారు. హెచ్చు పాటదారుడు వెంటనే ఒక సంవత్సరం శిస్తు మొత్తం ముందస్తుగా చెల్లించాలన్నారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు 90101 24115 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

8 నుంచి ఎస్ఎఫ్ఐ విద్యా, వైజ్ఞానిక శిక్షణా తరగతులు

కాకినాడ సిటీ: భారత విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులు శ్రీకాకుళం జిల్లాలో 8 నుంచి 15వ తేదీ వరకు జరుగుతాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నాయకులు పి.వరహాలు, ఎం.గంగా సూరిబాబులు తెలిపారు. శనివారం కాకినాడలోని సుందరయ్యభవన్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతుల కర పత్రాలను ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లాలో జరుగుతున్న విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని, ఎస్ఎఫ్ఐ, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జి.శ్రీకాంత్, ఎ.వాసుదేశ్, సాహిత్, గోపాలకృష్ణ, సిద్ధు, లోవరాజు, వెంకటేశ్, అరుణ్‌కుమార్, చిన్ని పాల్గొన్నారు.

తెలుగు భాషపై పట్టు అవసరం

పెద్దాపురం: తెలుగు భాష, తెలుగుతనంపై విద్యార్థులు పిన్న వయసు నుంచే మంచి పరిజ్ఞానం కలిగి ఉండాలని జి.రాజేష్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం తెలుగు పద్యాలు, నీతి కథలు, పుస్తక సమీక్ష వంటి అంశాలపై సుమారు 30 మంది విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు మాట్లాడుతూ గ్రంథాలయంలో అందిస్తున్న పుస్తకాలను చదివి విద్యార్థులు గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పీసీసీలో..

ప్రతి విద్యార్థి కరాటేలో తమ నైపు ణ్యాన్ని మరింత మెరుగుపర్చుకోవాలని విశాఖ కరాటే అసోషియేషన్ ఉపాధ్యక్షుడు మల్లా సుధాకర్ అన్నారు. పట్టణంలోని వరహాలయ్యపేట యానలపు సూర్యారావు భవనంలో నిర్వహిస్తున్న పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) సమ్మర్ క్యాంప్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా క్యాంప్ కన్వీనర్ కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుధాకర్ మాట్లాడుతూ కరాటేను క్రమశిక్షణతో నేర్చుకోవాలన్నారు. విద్యార్థుల ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనంతరం కరాటే మెళకువలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పీసీసీ గౌరవాధ్యక్షులు బుద్దా శ్రీనివాస్, కార్యదర్శి రొంగల అరుణ్, కరాటే టీచర్ దుంగల పూజిత, సూర్యశ్రీ, రవికుమార్, అమృత, నమ్రత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



మండల సమావేశంలో అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: గ్రామాల్లోని సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి, వాటిని పరిష్కరించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలకు అధికారులు తక్షణమే పరిష్కారం చూపాలన్నారు. ప్రజలకు అవసరమైన తాగునీటి సరాఫరా, పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల అభివృద్ధిపై అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. తొలుత వివిధ శాఖల అధికారులతో ఆయా శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ రివ్యూలో ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లో సమస్యలను ప్రస్తావించారు. వీటికి అధికారులు వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి.అరుణ, వైస్ ఎంపీపీలు చిక్కాల రాజ్యలక్ష్మి, సాదే లోవరాజు, ఎంపీటీసీ సభ్యులు కొప్పుల బాబ్జీ, పసల సూరిబాబు, కో ఆప్షన్ సభ్యుడు పసల నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు ఓలేటి చంటి, సర్పంచులు కూనపురెడ్డి సుబ్బారావు, సూతి ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గణితంపై శిక్షణ



ఏలేశ్వరం గ్రంథాలయంలో గణితంపై శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు సతీష్‌బాబు



కిర్లంపూడి గ్రంథాలయంలో పెయింటింగ్ వేస్తున్న విద్యార్థులు

ఏలేశ్వరం: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు గణితంపై శిక్షణ ఇచ్చారు. లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కన్నూరి సతీష్‌బాబు గణితంపై శిక్షణ ఇచ్చి, గణిత సమస్యల పరిష్కారంలో మెళకువలు నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ కళలు, చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, స్పోకెన్ ఇంగ్లిషు, మ్యాథ్స్, యోగా తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

బాలలకు ఉత్సాహంగా పోటీలు

కిర్లంపూడి: మండలంలోని గెద్దనాపల్లి, వీరవరం, కిర్లంపూడి శాఖా గ్రంథాలయాల్లో బాల బాలికలకు పలు పోటీలు నిర్వహిస్తున్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా శనివారం లైబ్రేరియన్ల ఆధ్వర్యంలో ఆటల పోటీలు, కథలు రాయడం, బుక్ రీడింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ నెల 7న జరిగే ముగింపు వేడుకల్లో బహుమతులు ప్రదానం చేస్తామని కిర్లంపూడి గ్రంథాలయాధికారి డి.మరిడిబాబు తెలిపారు.

పెట్రోల్ బంకు యజమానులు ఆంక్షలు పాటించాలి



గోకవరంలో బంకు యజమానులకు సూచనలిస్తున్న తహసీల్దార్ హేమకుమారి, డీటీ రజని

గోకవరం: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకూ పెట్రోల్ బంకు యజమానులు ఎన్నికల అధికారులు విధించిన ఆంక్షలను విధిగా పాటించాలని తహసీల్దార్ బి.హేమకుమారి, డిప్యూటీ తహసీల్దార్ ఎ.రజని సూచించారు. గోకవరం తహశీల్దార్ కార్యాలయంలో శనివారం మండలంలోని పెట్రోల్ బంకు యజమానులు, పోలీసు, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల అధికారి సూచనల మేరకు ఈ నెల 10 వరకు పెట్రోల్ బంకుల్లో లూజు విక్రయాలు నిర్వహించకూడదన్నారు. నిబంధనలు అతిక్రమించిన యజమానులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బంకులు సీజ్ చేస్తామని హెచ్చరించారు. అలాగే పాన్ షాపులు, కిరాణాషాపుల్లో లూజు పెట్రోల్, డీజిల్ విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతులు లేకుండా బాణసంచా సామాగ్రి నిల్వ ఉంచితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

వేతన బకాయిలు చెల్లించాలి

కాకినాడ సిటీ: నగరపాలక సంస్థలో క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) వాహన డ్రైవర్లకు రెండు నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ నాయకులు కోరారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, డ్రైవర్స్ యూనియన్ కోశాధికారి ఇస్మాయిల్ మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ నెల జీతం ఇప్పటికీ జమ కాలేదన్నారు. కమిషనర్ వెంకటరావు జీతాలు చెల్లించాలని ఆదేశించారన్నారని, వాటిని విడుదల చేయాలని కోరారు. యూనియన్ నాయకులు సంతోష్, విక్టర్, భద్ర, రాజేష్ పాల్గొన్నారు.